



# మహిళామండలీ - కుట్టుమిషనూ

**శ**ని, ఆదివారాలతో రెండు సెలవలు కలిసొచ్చాయని యాజలి వెళ్ళాం. అమ్మమ్మ సంబరంగా ఎదురొచ్చింది. కుశల ప్రశ్నలు అయి కాఫీ తాగుతూ 'ఏమిటమ్మా విశేషాలు?' అంది అమ్మ.

"పెద్ద విశేషమే ఉంది. ఆ మధ్యన వాళ్ళెవరో వచ్చారు. మన ఊళ్ళో అదేమిటో పెడతారుట. దానికి నేనేమిటోట, పిన్ని ఏమిటోట. మన గోపాలం భార్య రామసీత లేదూ అదేమిటోట. ఊళ్ళో ఆడవాళ్ళందరూ ఇంకేమిటేమిటోట..." అంది అమ్మమ్మ ముసిముసిగా నవ్వుతూ.

ఒక్క ముక్క అర్థంకాలేదు మాకు.

"అట్లా ఏమిటోట, ఏమిటోట అంటే ఏం అర్థం అవుతుంది? వివరంగా చెప్పు?" అన్నారు తాతయ్య.

"మీరే చెప్పండి" అంది అమ్మమ్మ.

"ఏం లేదమ్మా! ఆ మధ్య వీడీఓ గారు మనూరికి వచ్చారు. గ్రామాభివృద్ధి కోసం ఊరూరా మహిళామండలి ఏర్పాటు చేస్తున్నారుట. మనూళ్ళోనూ పెడతారుట.

ఆ మహిళామండలికి మీ అమ్మ అధ్యక్షురాలు, పిన్ని ఉపాధ్యక్షురాలు, గోపాలం భార్య కార్యదర్శి. మిగిలిన ఆడవాళ్ళందరూ సభ్యులూను" అన్నారు.

"అబ్బో, ఇంకేం! నీ గౌరవం మరింత పెరుగుతుంది" అంది అమ్మ.

మహిళామండలి ప్రారంభోత్సవం జరిగిందనీ అమ్మమ్మవాళ్ళంతా చాలా హడావిడిగా ఉన్నారనీ ఉత్తరం రాశారు.

రెండు నెలల తర్వాత ఊరికెళ్ళాం.

"ఎలా ఉంది మీ మహిళామండలి?" అని అడిగింది అమ్మ.

"ఏదో ఉంది. అటుకీ ఇటుకీ కాకుండా" అంటూ మొదలుపెట్టి బోలెడు విషయాలు చెప్పుకొచ్చింది అమ్మమ్మ.

ప్రారంభోత్సవానికి పట్టు చీరెలూ నగలూ వేసుకుని చక్కగా పేరంటానికి వచ్చినట్లు అందరూ వచ్చేరుట.

ఒక కుట్టు మిషను ఇచ్చారుట. పారిజాతం అనే కుట్టు టీచర్ని కూడా పెట్టేరుట. పారిజాతానికి డాన్సుకూడా వచ్చుట. కుట్లూ, డాన్సులూ నేర్పుతానందిట.

డాన్సులు నేర్చుకుంటామని నలుగురైదుగురు పిల్లలు ముందుకొచ్చారుట. పది రోజులు బాగానే నేర్చుకున్నారుట. తరవాత దెబ్బలాటలైపోయాయిట.

వీరభద్రయ్యగారి కూతురు లలితని బుచ్చెయ్యగారి కూతురు రామలక్ష్మి గడ్డం మీద తన్నిందట.

అప్పుడెప్పుడో లలితావాళ్ళింట్లో దొంగతనంగా దానిమ్మకాయలు కోస్తున్న రామలక్ష్మి అన్నయ్యని పట్టుకుని రెండు వాయించి నాలుగు తిట్టి పంపించారుట. అది మనసులో పెట్టుకుని కక్ష సాధింపు చర్యగా బదులు తీర్చుకున్నారని గొడవ చేసిందిట వీరభద్రం భార్య.

అదేంకాదు, కూర్చుని లేచే భంగిమలో పొరబాటున కాలు తగిలిందంటారుట వీళ్ళు.

ఆ తగిలే కాలేదో ఇంకెవరికైనా తగల్లేదేం. మా అమ్మాయికే తగిలిందేం అంటారుట వాళ్ళు. అది నెపంగా పెట్టుకుని ఏనాటి విషయాలో తవ్వి పోసుకుని ఆడవాళ్ళు జుట్టూ జుట్టూ పట్టుకుని అంతటితో ఆగక మగవాళ్ళదాకా పోయేసరికి తాతయ్యగారు కలగజేసుకుని సర్దిచెప్పారుట.

కుట్టు టీచరుని పిల్చి "ఏమ్మా పారిజాతమ్మా! డాన్సు నేర్పమంటే ఈ తన్నులాటలు ఏవిటీ" అని అడిగారుట.

"నేనేం ఎరగనండీ. డాన్సు నేర్పుతున్నాను. తాం తద్ధాం అని కూర్చుని కింద తథై తథై అని లేవాలి. అందరూ ఒకేసారి కూర్చుని లేస్తే సరిపోయేది. లలిత కాస్త ఆలస్యంగా లేచేసరికి రామలక్ష్మి కాలు ఆ పిల్ల గడ్డానికి తగిలింది" అందిట.

"సర్లే. ఎందుకొచ్చిన పీడాకారం. ఈ డాన్సులు చాలుగానీ" అని తాతగారంటూ ఉంటే పారిజాతం అడ్డుపడి-

"కాదండి, ఇంకా తరవాత అంతా తాంతాం తాంతాం అంటూనే ఉంటుందండీ డ్యాన్సు. కూచోటాలూ లేవటాలూ ఉండవు" అందిట.

"అసలేవీ లేకపోతేనే తన్నేసుకుని ఇంత రాద్ధాంతం చేసిన ఈ పిల్లలు తంతాం తంతాం అంటే సర్వమంగళం చేసిపెడతారు. వద్దులే తల్లీ-నీకో దణ్ణం" అన్నారుట తాతగారు.

"మరెలా" అందిట పారిజాతం.

"కుట్లు వచ్చు అన్నావుగా, అవి నేర్పు" అన్నారుట.

కుట్లు అనేసరికి అందరూ వెనక్కి తగ్గేరుట. "నా ఉద్యోగం ఊడిపోతుంది ఎవరికీ ఏవీ నేర్పకపోతే" అని పారిజాతం గుడ్ల నీళ్ళు కుక్కుకుందిట.

సరే ఉందిగా మన లక్ష్మీకాంతం. దానికి నేర్పిస్తే సరి అనుకున్నారుట.

మా ఊళ్ళో లక్ష్మీకాంతం అనే ఓ అమ్మాయి ఉంది. నా బుద్ధి తెలిసిన దగ్గర్నించీ ఆ అమ్మాయి వయసు పద్నాలుగే. వెర్రిమేళం. బొత్తిగా తెలివితేటలు లేవు...ఏదైనా విద్యలో ప్రావీణ్యం సంపాదిస్తే పెళ్ళవుతుందని తల్లిదండ్రుల తాపత్రయం.

వంటా సంగీతం వగైరాలన్నీ నేర్పించాలని విఫలమై ఊరుకున్నారు. పోనీ కుట్టు నేర్పిస్తే బావుంటుందని పారిజాతానికి అప్పజెప్పారు.

మిషను మా సావిట్లోనే ఉంది. పారిజాతం వారానికి నాలుగు రోజులొచ్చి పగలంతా నేర్పుతుందిట. లక్ష్మీకాంతం పాపం అన్నానికైనా పోకుండా రోజంతా నేర్చుకుంటుందిట.

గత పదిహేను రోజులుగా నిరాటంకంగా సాగుతున్నాయట కుట్టు క్లాసులు.

ఇంకాసేపట్లో వస్తారిద్దరూ-అంటూ ముగించింది అమ్మమ్మ.

పది కొట్టేసరికి ముందు లక్ష్మీకాంతం, తర్వాత పారిజాతం వచ్చేశారు.

"ఏం నేర్చుకుంటున్నావే లక్ష్మీకాంతం" అంది అమ్మ.

"జాకెట్టు నేర్చుకుంటున్నాను అక్కయ్యా" అంది లక్ష్మీకాంతం.

* * *

"అబ్బో! మా ఊళ్ళో ఉషామిషను వాళ్ళు నెల తిరిగినా పరికిణీ నేర్పటంలోనే ఉంటారు. నువ్వు పదిహేను రోజులకే జాకెట్టు దాకా వచ్చావంటే గొప్ప విషయమే" అంది అమ్మ.

"విజయని కూడా ఉంచి కుట్టు నేర్పించు అక్కయ్యా" అని సలహా ఇచ్చింది.

"చూద్దాంలే. ముందు నువ్వు నేర్చుకుంటే తర్వాత అది నేర్చుకుంటుంది" అంది అమ్మ.

కుట్టు క్లాసు మొదలైంది. కుతూహలంతో నేను వెళ్ళి నిలబడ్డాను.

"పారిజాతం అక్కయ్యా! పలకల మెడ జాకెట్టుకి కూడా రెండు చేతులూ కత్తిరించాలా?" అని అడుగుతోంది లక్ష్మీకాంతం గుడ్డ ముందేసుకుని.

"ఏ జాకెట్టుకైనా రెండు చేతులుండాలి కదా లక్ష్మీకాంతం" అంటోంది పారిజాతం నా దగ్గర్నించి పట్టికెళ్ళిన చందమామ తిరగేస్తూ.

ఇక అక్కడుంటే ప్రమాదం అని పరిగెట్టుకొచ్చేశాను.

మరో రెండు నెలల తర్వాత ఊరెళ్ళాం. కుట్టుమిషను హాల్లో ఉంది ముసుగేసుకుని.

"ఏమైందే అమ్మా కుట్టు క్లాసు?" అంటే-

"నా బొంద కుట్టు క్లాసు. అదేం నే[illegible]ందో-ఇదేం నేర్చుకుందో. నీకు జాకెట్టు కుడతా, పెద్దనాన్నకి బనీను కుడతా అని పీక్కుతింటూ ఉంటే నాకు కర్లపాలెంవాళ్ళు పెట్టిన పట్టు గుడ్డా, పావలా పోసి కొన్న బనీను గుడ్డా ఇచ్చాను. కుట్టి పట్టుకొచ్చింది. రవికె తొడుక్కు చూద్దామంటే ఒక చెయ్యిబాగానే ఎక్కింది, రెండో చెయ్యి దగ్గర ఇరుక్కుపోయింది. పైకీ పోదూ కిందికీ రాదూ. బలంగా లాగేసరికి చిరిగి ముక్కలైపోయింది."

"అయ్యో! కొత్త జాకెట్టు పిగిలిపోయిందా?" అంది అమ్మ.

"ఇంకానయం కాదూ. పట్టు గుడ్డ కాబట్టి చిరిగినా ఊడొచ్చింది. అదే మీ నాన్న బనీను తొడుక్కుని అందులో ఇరుక్కుపోతే ఏం చేసేవాళ్ళం? మల్లు గుడ్డ ఎంత పీకినా ఏం ప్రయోజనం? కవచంతో కర్ణుడిలా ఆయనలా బనీనుతో ఉండిపోవాల్సి వచ్చేది" అంది అమ్మమ్మ.

"మరి పారిజాతాన్ని పిల్చి అడగలా?"

"పారిజాతం ఊరొదిలి వెళ్ళాకేగా సొంతంగా లక్ష్మీకాంతం కుట్టు మొదలు పెట్టింది" అంది అమ్మమ్మ.

* * *